## నేడు బోడుప్పల్‌లో ఎమ్మెల్యే పర్యటన

బోడుప్పల్, మార్చి21: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థాగత అంశాలతో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

## నీటి వృథాను అరికట్టండి

కాప్రా, మార్చి 21: నీటి వృథాను అరికట్టాలని, నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు 'నీటి ప్రాధాన్యత- వినియోగం'పై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని జలమండలి కాప్రా సర్కిల్ డిప్యూటీజనరల్ మేనేజర్ సతీష్ అన్నారు. గురువారం ఆయన జలమండలి కార్యాలయంలో మాట్లాడుతూ 'వరల్డ్ వాటర్ డే'ను పురస్కరించుకొని శుక్రవారం పలు కాలనీల్లోని ప్రజలకు పాఠశాలల్లో నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భూగర్భజలాలు పెంపుకు కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ ఏర్పాటుతో పాటు, నీటి పొదుపుపైనా అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు.

### కండ్లకోయలో...

మేడ్చల్ రూరల్: నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని ప్రొఫెసర్ రాజ్ కుమార్ సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలోని పోలీస్ శిక్షణా కళాశాలలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్ బృందానికి గురువారం శాంతి కోసం నీరు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# విత్తన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చేయూత



నూతనకల్ గ్రామంలో సీడ్ హెల్త్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, వ్యవసాయ ఉత్పత్తి శాఖ కమిషనర్ ఎం.రఘునందన్ రావు తదితరులు

- వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేశాం..
- దేశానికి 60శాతం విత్తనాలు రాష్ట్రంలోనే ఉత్పత్తి
- రాష్ట్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు
- నూతకల్‌లోని సీడ్ హెల్త్ ల్యాబ్ ప్రారంభం

మేడ్చల్ రూరల్, మార్చి 21: దేశంలో 60 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని రాష్ట్రంలో పూర్తిగా డిజిటలైజేషన్ చేశామని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వశాఖ కార్యదర్శి, వ్యవసాయ ఉత్పత్తి శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు అన్నారు. జిల్లాలోని మేడ్చల్ మండలం పరిధి నూతనకల్ గ్రామ శివారులోని సింజెంటా కూరగాయల విత్తనాల కంపెనీలో అత్యాధునికంగా ఏర్పాటు చేసిన సీడ్ హెల్త్ ల్యాబ్‌ను తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ డి కె శ్రీవాస్తవతో కలిసి రఘునందన్ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో కలిసి ల్యాబ్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు భూమి, పంటల వివరాలను డిజిటలైజేషన్ చేశామని, దీంతో వ్యవసాయ అనుబంధరంగ కంపెనీలకు, వ్యవసాయ పరిశోధనకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదే విధంగా విత్తనాల స్టోరేజ్, ఉత్పత్తి దారుల లైసెన్స్, ఫర్టిలైజర్ వివరాలు ఆన్‌లైన్ సిస్టం అయ్యిందని చెప్పారు. అగ్రికల్చర్ డెటా ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని ప్రస్తుతం ప్రారంభించామని, డేటాను ఎవరు హ్యాక్ చేయకుండా పూర్తి భద్రత ఉంటుందని పేర్కొన్నారు. అదే విదంగా దేశానికి 60 శాతం మేర విత్తనాలను తెలంగాణ రాష్ట్రం నుంచి సరఫరా అవుతున్నాయని అన్నారు. విత్తన పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తున్నదని, ఈ పరిశ్రమల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టాలని కోరారు. ప్రపంచంలోనె అత్యాధునిక సీడ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా ఆరోగ్య కర విత్తనాల తయారీకి సింజెంటా కంపెనీ సభ్యుల బృందం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రపంచ అగ్రశ్రేణి ప్రమాణాలతో ఏర్పాటు చేసిన సీడ్ హెల్త్ ల్యాబ్‌తో సాగుదారులకు అత్యధిక నాణ్యతతో కూడిన ఆరోగ్యకర కూరగాయల విత్తనాలను అందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రూ.20 కోట్లతో 6500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతో రూపుదిద్దుకున్న ల్యాబ్‌లో సంవత్సరానికి 12వేల వైరస్ పరీక్షలను చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సింజెంటా వెజిటబుల్ విత్తనాల ఆసియా పసిపిక్ హెడ్ నిశ్చింత్ భాటియా, కంపెనీ వెజిటబుల్ విత్తనాలు, ఫ్లవర్ క్యాలిటీ మేనేజ్‌మెంట్ గ్లోబల్ హెడ్ ఎరిక్ పోస్ట్మా, వ్యవసాయ జిల్లా అధికారి మేరీ రేఖా, మండల వ్యవసాయ అధికారి అర్చన, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఉప్పల్, మార్చి 21: కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ లక్ష్మీనారాయణకాలనీలోని డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు పూర్తిచేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక సమస్యలను సత్వరం పరిష్కరించేలా సమన్వయంతో ముందుకుసాగుతామన్నారు. కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరించేలా చూస్తామన్నారు. కాలనీల్లో నీటి, డ్రైనేజీ, రోడ్డు ఇబ్బందులు లేకుండా తగిన నిధులు తీసుకువస్తామన్నారు. సమస్యలను తనదృష్టికి తీసుకువస్తే, తప్పక పరిష్కరించేలా చూస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాయసం గోపాల్, రవీందర్, యాదగిరియాదవ్, శివరెడ్డి, శివకుమార్, రాఘువేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శామీర్‌పేట, మార్చి 21: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీడబ్ల్యూవో కృష్ణారెడ్డి అన్నారు. శామీర్‌పేటలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు శ్రీమంతాలు, అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మమ్మ, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు నిర్మళ, శకుంతల, పావనీ, భవానీ, టీచర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న డీడబ్ల్యూవో కృష్ణారెడ్డి

# సృజనాత్మకత పెంపునకు సాంకేతిక సదస్సులు దోహదం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి

మేడ్చల్, మార్చి 21: సృజనాత్మకత పెంపునకు సాంకేతిక సదస్సులు దోహదం చేస్తాయని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి అన్నారు. రెండు రోజుల జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక, సాంస్కృతిక సంబురం 'అక్షర 2కే 24' గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంస్కృతిక, సాంకేతిక ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ప్రతి ఏటా అక్షర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోడింగ్ పోటీలు, హ్యాకథాన్, స్టూడెంట్ హాస్ గాట్ టాలెంట్, మిస్టర్ అండ్ మిసెస్ అక్షర వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సంబురంలో దాదాపు 10వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. క్లౌడ్ పర్ సీ సంస్థ ఉపాధ్యక్షుడు సుధీంద్ర కులకర్ణి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఆమెజాన్ సంస్థ మానవ వనరుల విభాగం అధికారి అనిల్ మాట్లాడుతూ గతేడాది 28వేల నియామకాలు చేపట్టామని, ఈ సారి ఆ సంఖ్యను 30వేలకు పెంచనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు డాక్టర్ పిల్లా శ్రీనివాస్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ మోహన్ శ్రీనివాస్, డాక్టర్ వసంతకుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మేడ్చల్, మార్చి 21: విద్యార్థి దశలో నైపుణ్యాలను పెంపొందిచుకుంటేనే ఉన్నత భవిష్యత్ ఉంటుందని గుండ్లపోంచపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. గురువారం కళాశాల ప్రముఖ బహుళ జాతి సంస్థ ఇన్ఫర్మేషన్ అండ్ డేటా సిస్టమ్స్(ఐడీఎస్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను నేరుగా పరిశ్రమకు పని చేసే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.ఎమర్జింగ్ టెక్నాలజీస్ అయిన బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ అంశాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, టీపీవో డాక్టర్ శ్రీకాంత్, ఏవో అనురాగ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, హెనోటిక్ సొల్యూషన్స్ ఫౌండర్ మల్లేశ్, ఐడీఎస్ బిజినెస్ స్ట్రాటజీ హెడ్ సునీల్ సుబ్రహ్మణ్యం, పీఆర్‌వో రవి సుధాకర్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఐడీఎస్‌తో ఒప్పందం చేసుకుంటున్న సెయింట్ పీటర్స్ కళాశాల కార్యదర్శి టీవీరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత

## మంత్రికి వినతి

ఉప్పల్, మార్చి 21: స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజాదర్బార్‌లో భాగంగా స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు, వినతి పత్రాలను పరిశీలించి, పరిష్కారానికి కృషిచేస్తున్నామని తెలిపారు. ఈమేరకు గురువారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి సమస్యలను విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

## విజేత జట్టుకు అభినందనలు

మేడ్చల్: థ్రోబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థులను కళాశాల చైర్మన్ భూపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీశైలం రెడ్డి, ప్రిన్సిపాల్ కేఎస్ రెడ్డి, పీడీ రాజేశ్ ప్రత్యేకంగా అభినందించారు.



## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శామీర్‌పేట, మార్చి 21 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడిసిటీ వైద్యుడు అభిషేక్ అన్నారు.శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 132 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ కారణాలతో 33 మందిని ఆస్పత్రికి రీఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఓమార్, అభిషేక్, వైభవి, దివ్య, సమ్రాన్, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, పూజలు పాల్గొన్నారు.



లాల్‌గడి మలక్‌పేటలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

# లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి




కార్యక్రమంలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్,కళాశాల నిర్వాహకులు

ఘట్‌కేసర్,మార్చి21:ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు విద్యార్థులు కృషి చేయాలని ఆర్టీసీ ఎండీ వి.సి సజ్జనార్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ ఫార్మా సంపతి 2024 పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గెస్ట్‌ఆఫ్ ఆనర్‌గా పాల్గొన్న డాక్టర్ రఘురాం రావు కళాశాలల్లో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందని వివరించారు.

అనంతరం కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నల్ల నర్సింహా రెడ్డి, డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి,డీన్‌లు డాక్టర్ జనార్దన్ రాజు,డాక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్టు కృషి



బీజేఆర్ కాలనీవాసి కృష్ణ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

చర్లపల్లి, మార్చి 21 : పేదల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్టు కృషి చేస్తుందని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీవాసి కృష్ణ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమార్ స్వామి, నాయకులు రహీం, శోభారాణి, సత్తెమ్మ, గుమ్మడిరాజు యాకయ్య, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త వేయవద్దు..



మల్కాజిగిరి మిర్జాలగూడ బేతల్ ప్రేయర్ హౌజ్ వద్ద అవగాహన కల్పిస్తున్న పారిశుధ్య సిబ్బంది

మల్కాజిగిరి,మార్చి21: రోడ్లపైన చెత్త వేయవద్దని మల్కాజిగిరి సర్కిల్ పారిశుధ్య విభాగం డీఈఈ మాధవి సూచించారు. గురువారం మల్కాజిగిరి సర్కిల్ మిర్జాలగూడలోని మేతల్ ప్రేయర్ హౌజ్ వద్ద రోడ్డుపై చెత్త వేయవద్దంటూ స్థానికులకు సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ జాయింట్ కమిసనర్ రాజేందర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, మాణిక్యరావు, శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, సంజీవ, యాదగిరి, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, మార్చి 21: ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీబాలాజీ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి వరకు చదివిన నిరుద్యోగ యువత అయి ఉండాలన్నారు. ఈనెల 25 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.వివరాల కోసం 9542517118 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ప్రోగ్రాం ప్రతినిధులు

రామంతాపూర్,మార్చి 21: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ టీఎస్‌ఏసీఎస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్తంగా హెచ్‌ఐవీ నివారణ పేరుతో రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్ నిర్వహించారు. జిల్లా నుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ యూత్ స్టేట్ కోర్డినేటర్ రమేశ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్, రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ నర్సింహస్వామి మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఒకరి నుంచి మరొకరికి ఎలావ్యాప్తి చెందుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయంతి,ఎన్ఎస్ఎస్ పీవో ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

### పలు బెల్ట్‌షాపులపై ఎస్ఓటీ దాడులు

కుత్బుల్లాపూర్,మార్చి21 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఏలాంటి పత్రాలు లేకుండా ఓ ట్రాలీ ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని మేడ్చల్ ఎస్ఓటీ బృందం పట్టుకున్నారు. కొంపల్లిలో కమాన్ నుండి మున్సిపల్ కార్యాలయం వెళ్లే దారీ నుండి ట్రాలీ ప్యాసింజర్ ఆటోలో తరలిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ ఎస్ఓటీ బృందం చేపట్టిన తనిఖీల్లో పట్టుబడింది. ఈ క్రమంలో ఆటోలో తరలిస్తున్న 480 లీటర్ల బట్‌వైజర్ బాటిల్స్ పట్టుబడడంతో పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు.

### బెల్ట్‌షాపులపై దాడులు...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు బెల్ట్‌షాపులపై బాలానగర్, మేడ్చల్ ఎస్ఓటీ బృందాలు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 55.8 లీటర్ల మద్యం, దుండిగల్ పీఎస్ పరిధిలో 6.43 లీటర్ల మద్యాన్ని పట్టుకొని ఆయా పోలీస్‌స్టేషన్లకు అప్పగించగా పోలీసులు కేసునమోదుచేసిదర్యాప్తుచేస్తున్నారు.

# అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు



జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది



చీర్యాల్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

కీసర, మార్చి 21: అసైన్డ్ భూమిల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధి చీర్యాల్‌లోని అసైన్డ్‌భూమిలో సర్వే నంబర్ 59లో అక్రమ నిర్మాణాలు,చీర్యాల్‌లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను గురువారం వారు జేసీబీతో కూల్చివేయించారు.

### అక్ర నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులే..

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వే నం. 420, 426, 606లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గురువాం కూల్చివేశారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో నిర్మించిన షెడ్లను కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం




జ్యోత్స్న(ఫైల్)

దుండిగల్, మార్చి 21: సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు కథనం ప్రకారం.. ఏపీలోనిశ్రీకాకుళం జిల్లా, మామిడిపల్లి గ్రామానికి చెందిన కర్రి అశోక్, జ్యోత్స్న (23) దంపతులు. ఫిబ్రవరిలో వారు ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి సుభాశ్‌చంద్రబోస్ నగర్‌లో ఉంటున్నారు. అశోక్ జీడిమెట్లలో ఓ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఈనెల 18వ తేదీన విధులు ముగించుకుని అశోక్ రాత్రి ఇంటికి రాగా భార్య కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీశాడు. ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసునమోదు చేసిదర్యాప్తుచేస్తున్నారు.

### సూరారం కాలనీలో...


సూరారం కాలనీలోని రెండవ ఓం జెండా వద్ద కిరాణషాపు నిర్వహిస్తున్న మనోజ్ కచ్వా కూతురు నాన్సి(16) ఈ నెల 20న పక్కనే ఉంటున్న తన నానమ్మ దగ్గరకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లింది. అయితే రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో మనోజ్‌ఆరా తీయగా అక్కడికి వెళ్లనట్లు తేలింది. స్వగ్రామం అయిన రాజస్థాన్‌లో బన్సిలాల్ అనే యువకుడు ప్రేమపేరుతో వెంటపడేవాడని, అతడిపై అక్కడి నాగోర్, గాంధీ చౌక్ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు మనోజ్‌కచ్వా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనే రాజస్థాన్ నుంచి వచ్చి తన కూతురిని తీసుకెళ్లి ఉండవచ్చునిఅనుమానం వ్యక్తం చేయగా.. పోలీసులు కిడ్నాప్, అదృశ్యం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సూరారం కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్,రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

దుండిగల్, మార్చి 21 : మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి సూరారంలోని కట్టమైసమ్మ ఆలయంతో పాటు దుండిగల్‌లోని సింగాపురం మైసమ్మదేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## ఎంఎల్ఆర్ఐటీలో సీఎస్ఐ ఛాప్టర్ బాడీ ఆవిష్కరణ



సీఎస్ఐ ఛాప్టర్ బాడీ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

దుండిగల్, మార్చి 21: విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే లక్ష్యంగా మర్రిలక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ)కళాశాల ముందుకు వెళ్తుందని కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో 'టెక్‌కనెక్ట్' పేరుతో సీఎస్ఐ ఛాప్టర్ బాడీని గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. శోధించు, ఆవిష్కరించు, సమాజానికి అందించు అనే నినాదంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి, డీన్ డా.రాధికాదేవి, సీఎస్ఈ విభాగాధిపతి బలరాం, ఏఐఎంఎల్ విభాగాధిపతి కే.సాయిప్రసాద్, ఐటీ విభాగాధిపతి డా.ఎన్‌వీ.రాజశేఖర్‌రెడ్డి, సీఎఐటీ విభాగాధిపతి డా.పీ.సుభాషిణీ, డేటా సైన్స్ విభాగాధిపతి చిరంజీవి మాణికే తదితరులు పాల్గొనగా.. గౌరవ అతిథిగా కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి, ఐఈటీఈ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

## తాగడానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడు ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

జవహర్‌నగర్, మార్చి 21: తాగడానికి డబ్బులు ఇవ్వాలని కుమారుడు తల్లిని కోరగా ...నిరాకరించడంతో కుమారుడు కోపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం... జవహర్‌నగర్‌లోని మోహన్‌రావు కాలనీలో బండారి నర్సింగ్ రావు, భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి నివాసముంటున్నాడు. కుమారుడు రాజశేఖర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనంసాగించేవాడు. మద్యం అలవాటు ఉన్న రాజశేఖర్ నిత్యం తాగేవాడు. బుధవారం రాజశేఖర్ తల్లికి ఫోన్ చేసి మద్యానికి డబ్బులు కావాలని అడిగాడు. ఇప్పటికే తాగి ఉన్నావని డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. ఇంటికి వచ్చిన రాజశేఖర్(33) కుటుంబసభ్యులతో మాట్లాడి పడక గదిలోకి వెళ్లాడు. రాజశేఖర్ భార్య ప్రసవం కావడంతో తల్లిగారింట్లోనే ఉంటుంది. గురువారం ఉదయం రాజశేఖర్ లేవకపోడంతో తలుపులు పగులకొట్టి చూడగా అప్పటికే చీరతో ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించారు. కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**CAUTION NOTICE**

My client Thota Pooja, C/o. Sunchu Sravan, R/o 2-3-25/2/S-P, Chinn Cherlapally, Cherlapally, Hindustan Cables P.O. Medchal Malkajgiri District, lost her original link document (sale deed) registered vide document **No.6221 of 2003** Registered in the office of SRO, Uppal, Pertaining to Plot No.34 southern Part admeasuring 100 Sq.yds in Sy.No.23 and 24 situated at Block No.2, Old Village, Cherlapally, Ghatkesar Mandal, Kapra Municipality, R.R. Dist (Presently Medchal Malkajgiri District) while travelling from ECIL 'X' Roads.

Therefore the general public is hereby informed that not to enter any transaction in respect of above property with any third person basing on the above mentioned registered sale deed and my client informs that if any person/s found the above said document hand over the same to undersigned and said person/s will be honored.

Sd/- **S.S. PRAKASH REDDY,**
**V. BAPI REDDY,** Advocates
IInd Floor, Andal Complex,
Opp: Venkateshwara Swamy Temple,
Kushaiguda, ECIL Post,
Hyderabad - 062. **Cell: 9440067268**